# అంతర్మథనం

-ఆర్. ఎస్. హైమవతి

"ఎక్కడినించండీ ఆ ఉత్తరం?"

భర్త చేతిలో ఉత్తరం చూసి అడిగింది కౌసల్య.

"ఇంకెక్కడినించీ? మీ అయ్య దగ్గర్నించీ! ఆ పల్లెటూరి మేళాం మళ్లీ మన్నింట్లో మకాం పెడతారట." భర్త వెంకట్రావు మాటల తీరు, ముఖంలోని భావాలు చూస్తూంటే అర్థమైంది కౌసల్యకి తాను మళ్లీ త్వరలోనే ఒక తుఫానుని ఎదుర్కోవలసి వస్తుందని.

ప్రతీ సంవత్సరంలోనూ యించుమించు ఆరునెలలు ఈ తుఫాను దాడికి తట్టుకుంటూనే ఉన్నప్పటికీ ఈసారెందుకో గుండెలు దడదడ కొట్టుకున్నాయి. తలుచుకుంటేనే తల తిరుగుతోంది. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. చేతులూ • కాళ్లూ వణుకుతున్నాయి. చివరికి మతిభ్రమణం కూడా జరగవచ్చునిపించింది కౌసల్యకి.

ఈసారి ఏమయినా సరే ఈ సమస్యకి ఓ పరిష్కారం ఆలోచించాల్సిందే! లేకపోతే ఇక ఈ తుఫానులకి తను తట్టుకోలేదు. మానసికంగా ఆందోళనలు ఎక్కువయ్యే సరిక శరీరం కూడా రోజురోజుకీ ఆరోగ్యాన్ని కోల్పోతోంది. ఈసారి ఏమయినా సరే! ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందే! దృఢంగా నిశ్చయించింది కౌసల్య.

*********************

కౌసల్య తల్లిదండ్రులు-రామయ్య, సీతమ్మ. వారికి ఇద్దరే అమ్మాయిలు. పెద్దకూతురు సుమిత్రకి చిన్నప్పుడే పెళ్లి చేసేశారు వారి స్వగ్రామంలోనే ఉన్న బంధువుకిచ్చి.

ఇక రెండవ కూతురు కౌసల్య చదువుకుంటానని పట్టుపట్టి పట్టణంలో ఉన్న మేనమామ ఇంట్లో ఉండి చదువుకుంది. బి.ఎస్.సి. బియిడి ముగించి ఆ పట్టణంలోనే ఉన్న ఒక గవర్నమెంటు స్కూల్లో టీచరు ఉద్యోగం సంపాదించింది.

వారి కులంలో చదువుకున్న అమ్మాయిలు తక్కువ. అందులో కౌసల్య అందంగానే ఉంటుంది. కనుక ఆ కులంలోని చదువుకున్న అబ్బాయిలు కొందరు ఆమెని చేసుకోవాలని ఉవ్విళ్లూరారు.

వెంకట్రావు ఇంజనీరు. ఆస్థిపరుడు. సిటీలో మంచి సెంటరులో స్వంత ఇల్లు వుంది. మనిషి బాగుంటాడు. చెడు అలవాట్లు లేవు. ఇవన్నీ చూసి వెంకట్రావుకి కౌసల్య నివ్వాలని రామయ్య, సీతమ్మ నిశ్చయించారు. కౌసల్య కూడా అందుకు ఇష్టపడింది.

రామయ్య తనకి ఉన్న ఇరవై ఎకరాల పొలంలో- ఉన్న వాళ్లు ఇద్దరమ్మాయిలే కాబట్టి పెళ్లి సమయంలోనే ఇద్దరికీ చెరొక ఐదెకరాలు రాసి ఇచ్చేశాడు.

మరో ఐదెకరాలు కూతుళ్ల పెళ్లిళ్లకి, పురుళ్లకి, ఆళ్లుళ్ల పండగ సత్కారాలకే హారతి కర్పూరంలా హరించి పోయింది.

వ్యవసాయాన్నేనమ్ముకుని- చదువు సంధ్యలు లేక, వేరే ఆదాయం వచ్చే విధంలేని రామయ్య మిగిలిన ఆ ఐదెకరాల మెట్ట పొలంతోనే ఏదో మెట్టపైర్లు పండించుకుంటూ ఆ పల్లెటూరిలోని స్వంత ఇంట్లో ఉంటూ కాలం గడిపాడు భార్యతో. కాని, రాను రాను అతడి ఆరోగ్యం దెబ్బతింది. వయసు ముదిరింది. కళ్లు కనబడ్డంలేదు. భార్య సాయంతోనే అన్ని పన్లూ జరుగుతున్నాయి. కనీసం చూపైనా సరిగ్గా ఉంటే తన పని తాను చేసుకోవచ్చునని అతడి బాధ.

రాను రాను సీతమ్మ ఆరోగ్యం కూడా అతంత మాత్రంగానే తయారైంది. పల్లెటూరి ఇంటి చాకిరి, వంటపని అన్నీ చూసుకునే ఓపిక ఆమెకి లేదు.

ఊళ్లో ఉన్న పెద్ద కూతురు సుమిత్రని, అల్లుడిని, పిల్లలని వచ్చి ఇంట్లో ఉండమన్నాడు రామయ్య.

"మా ఇల్లు వాకిలి అన్నీ ఉండగా అవి వదులుకొని మీ ఇంట్లో ఉండడం మాకేం ఖర్మ?" అన్నాడు అల్లుడు.

"పోనీ మేమే వచ్చి మీ ఇంట్లో ఉంటాం. మాకు బొత్తిగా ఓపికలేదు. ఇంటి పనీ, వంటపనీ మీ అత్త చూసుకోలేకపోతోంది. పొలం చూసుకోడానికి పాలికాపుని పెట్టాను. వాడి జీతం పోగా నువ్వే మిగిలింది తీసుకో" అన్నాడు రామయ్య.

"బాగుంది వరస. ఉన్నది ఐదెకరాల మెట్టపొలం. వచ్చే ఆదాయమే తక్కువ. అందులో పాలికాపు జీతం పోగా మిగిలే కాస్తా మీకు బట్టలకి, తిండికి, మందులకీ, నీ చుట్టముక్కలకే చాల్దు. ఇక నేనేంటి తీసుకునేది? మిమ్మల్నే నేను పోషించాలి.

ఇదంతా ఎందుకు? మీ చిన్నకూతురికి పెద్ద చదువు చదివించావుగా! ఉద్యోగం చేస్తోందాయె! దాని దగ్గరకే పో! నీ పెద్ద కూతురేం ఉద్యోగం చేసి సంపాదించడం లేదు మిమ్మల్ని పోషించడానికి" అన్నాడు అల్లుడు.

ఇక చేసేది లేక....ఆ పల్లెటూరి ఇంట్లో అద్దెకి కూడా ఎవరూ రారు కనుక తెలిసిన వాళ్లని కాస్త చూస్తూ ఉండమని చెప్పి చిన్న కూతురు దగ్గరికి ప్రయాణమయ్యారు ఆ దంపతులు.

కౌసల్యకి తనని కని పెంచి పోషించి చదివించి ఇంతదాన్ని చేసిన తన తల్లిదండ్రులని వారి చివరి దశలో తను ఆదుకోవాలనే ఉంది.

కాని, వెంకట్రావుకి తన అత్త, మామల పల్లెటూరి పాతకాలం అలవాట్లు నచ్చవు. ఎక్కడపడితే అక్కడ చతికిలబడటం, చుట్టలు కాల్చి ఆ బూడిద ఎక్కడబడితే అక్కడ రాల్చటం, సగం కాల్చిన పీకలు ఎక్కడపడితే అక్కడ పడెయ్యడం, గట్టిగా మాట్లాడడం, నవ్వడం లాంటివి నచ్చవు. ఇతడు చెప్పినా వాళ్ల అలవాట్లు వాళ్లు మానుకోలేరు.

తమ హోదాకి తగ్గట్టు డిగ్నిఫైడ్‌గా ఉండాలంటాడు. కౌసల్య చదువుకుని పట్నంలో పెరిగింది. ఉద్యోగం చేస్తోంది. కనుక ఆమె తన భర్తకి



తగనట్లు మసులుకుంటుంది. ఇటు తల్లిదండ్రులకి చెప్పి చూసినా వీళ్ల పద్ధతులు మార్చుకోలేరు. వాళ్లని ఆ వయసులో గట్టిగా తిట్టలేదు. భర్త తిడుతుంటే సహించలేదు. ఇటూ చెప్పలేక అటూ చెప్పలేక నలిగిపోతుంది.

కౌసల్య నెలకి దగ్గిర దగ్గిర మూడువేలు సంపాదిస్తోందన్న మాటే గాని, జీతం రాగానే భర్తకే ఇచ్చేస్తుంది. తన నిత్య అవసరాలకి అతడినడిగే తీసుకుంటుంది.

ఏ ఖర్చు చేసినా అతడి నడిగే చేస్తుంది. పెళ్లికి తన పుట్టింటి వారిచ్చిన ఐదెకరాల పొలం అమ్మేసి మేడమీద మోడరన్‌గా ఇల్లుకట్టి అద్దెకిస్తానంటే వద్దనలేదు కౌసల్య.

కొడుక్కి లక్షరూపాయలు డొనేషన్ కట్టి హాస్టల్‌లో పెట్టి ఇంజనీరింగ్ చదివిస్తున్నాడు వెంకట్రావు. కూతురికి మరో లక్షకి పైనే డొనేషను కట్టి మెడిసిన్ చదివిస్తున్నాడు.

అత్తమామల్ని చూస్తే మాత్రం గొంగళీ పురుగుల్ని చూసినట్లుఉంటుంది వెంకట్రావుకి.

ఇక్కడ అల్లుడి ఆంక్షలు, తిట్లు, విసుగులు సహించలేక మనుమడు, మనుమరాళ్ల నిరసనలకి తట్టుకోలేక- కౌసల్య తెల్లవారుఝాము నాలుగు గంటలకి లేచి చేసే ఇంటిపనీ, వంటపని, ఆఫీసు, తిరిగి వస్తూనే పని, రాత్రివరకూ చదువు క్షణం

# అంతర్మథనం

తీరికలేని కూతుర్ని తాము ఉండి ఇంకా కష్టపెడుతున్నామనే బాధతోనూ తిరిగి పెద్దకూతురు దగ్గిరికి వెళ్తూ ఉంటారు.

తిండి కూడా సరిగా తిన్నివ్వని ఆ అల్లుడి ఇంట్లో ఉండలేక తిరిగి ఇక్కడికి వస్తారు రామయ్య, సీతమ్మ.

తండ్రికి కళ్లు కనపడకపోడం మూలాన మరిన్ని సమస్యలెదురౌతున్నాయని గ్రహించిన కౌసల్య అతడిని ఓరోజు కళ్లడాక్టరు దగ్గరికి తీసుకెళ్లింది. కళ్లకి కేట్రాక్ట్ వచ్చిందని, ఆపరేషన్ చేస్తే సరిపోతుందని డాక్టర్ చెప్పారు.

ఆపరేషను అంటే- డాక్టర్ ఫీజు, మందులు, ఆస్పత్రిలో రూము అన్నింటికీ కలిపి ఐదారువేలు కావచ్చు. అంత ఖర్చు భర్తని అడగందే తను చెయ్యలేదు. అందుకే ఓరోజు అడిగింది కౌసల్య.


"ఏమండీ! నాన్నగారికి కళ్లు సరిగా కనిపించడం లేదు. అందుకే మరీ సమస్యలెదురౌతున్నాయి. డాక్టరుకి చూపించాను. కేట్రాక్టు ఉందని, ఆపరేషన్ చెయ్యాలని చెప్పారు. ఆయనకా ఆపరేషన్ చేయిస్తే ఆయన పనులు ఆయన చేసుకోడానికి వీలవుతుంది. అమ్మకి, మనకి కూడా శ్రమ తగ్గుతుంది. కళ్లు సరిగా కనపడితే మీరు విసుక్కునే లాంటి అవకతవక పన్లు చెయ్యకుండా ఉంటాడు" అంది.

"చాల్లే! బురదలో పొర్లే పంది బురదలోనే సుఖం వుందనుకుంటుంది గాని పందిరి మంచంమీద పడుకోబెడితే పడుకుంటుందా? వెళ్లి మళ్లా ఆ బురదలోనే దొర్లుతుంది. మీ వాళ్లకి కళ్లు కనిపించినా కనిపించకపోయినా ఒకటే!"

"కాదండీ! మొన్న మనింట్లో ఎన్నోసార్లు కళ్లు కనబడక గోడ తగిలించుకుని తలకి రక్తం వచ్చింది. రెండు మూడు సార్లు కాళ్లకి ఏవో తగిలి పడి నడుం పట్టేసి లేవలేకపోతే అమ్మ లేవతీయడానికి-బాత్‌రూమ్‌కి తీసుకు వెళ్లడానికి అవస్థ పడింది. ఆవిడకీ వయసయిపోతోంది కదా! కనుక ఆపరేషను చేయిస్తే ఆయన పన్లు ఆయన చేసుకుంటాడు" అంది నిదానంగానే.

"నీ జాలి కబుర్లు బాగానే ఉన్నాయి గాని ఆపరేషన్ అంటే మాటలా? ఐదారువేలు పైనే ఖర్చవుతుంది. అంత డబ్బు ఇప్పుడెక్కడి నుంచి తెస్తాం? రేపో మాపో ప్రాణం పోయే ఈ ముసలాడికి అంత ఖర్చు పెట్టడం దండగ" అన్నాడు స్థిరంగా వెంకట్రావు.

కౌసల్య మనసు చివుక్కుమంది. ఐదెకరాల పొలం వరకట్నంగా ఇచ్చి పెళ్లి చేశారు. మిగిలిన ఆస్థిలో కూడా వాళ్ల తదనంతరం సగం ఆస్థి



తమ స్వంతమౌతుంది అన్నిటికీ మించి తనని కని, పెంచి పెద్ద చేసి చదువు చెప్పించారు ఈనాడు మూడువేలు తను నెలకి సంపాదిస్తోందంటే అది వారి చలవే!

తన తండ్రి ఇచ్చిన పొలం అమ్మి మేడమీద వేసిన వాటాకి అద్దె నెలకి రెండు వేల ఐదువందలు వస్తోంది ఇంత ఆదాయం వారివల్ల పొందుతూ వారి ఆరోగ్యానికి ఆరు వేలు ఖర్చు పెట్టడానికి వెనకాడే భర్తని ఏమనాలి? ఏమనగలదు? అని భర్తతో విరోధం తెచ్చుకోగలదా? అలా అని చూస్తూ చూస్తూ అన్యాయాన్ని సహించగలదా? అందుకే స్థిర నిర్ణయం చేసింది

**********************

"ఎక్కడికి వెళ్తున్నావు?" అడిగాడు వెంకట్రావు

"నాన్నకి ఆపరేషను అయింది చూడ్డానికి వెళ్తున్నాను"

"ఎప్పుడైంది? ఎక్కడైంది? ఎలా అయింది? నాతో చెప్పలేదేం!"

"చెప్పి ఏం లాభం? ఆ ముసలాడి మీద ఖర్చు పెట్టడం దండగ అని తీర్మానించారుగా!"

"అయితే మరెలా ఖర్చు పెడుతున్నావు?"

"నా డబ్బేగా ఖర్చు పెడతానండీ? నా దగ్గిర డబ్బుందిగా?" ఆధునిక సమాజంలో స్త్రీలు సంపాదనా పరులే గాని స్వతంత్రులు కారు తన సంపాదన మీద తనకి ఖర్చు పెట్టుకునే అధికారం లేదు అటువంటప్పుడు తల్లిదండ్రులకి ఖర్చు పెట్టే అధికారం ఎలా వస్తుంది? అంది" నిదానంగానే.

"దొంగ తిరుగుడు మాని డబ్బెక్కడి నించి తెచ్చావో, ఎలా ఖర్చు పెడుతున్నావో చెప్పవోయ్!"

"మన డబ్బుకాదు అది వాళ్ల డబ్బే!"

"వాళ్లకంత డబ్బెక్కడిది?"

"మా వూళ్లో నా వాటాకి వచ్చే ఇల్లు అమ్మేశాను"

# వింతల్లో వింత



పుష్టిగా వుండటం పిల్లలకైనా, పెద్దలకైనా ఒక వరమే అయినా మరీ అతిగా వుంటే ఎవరికైనా ఇబ్బందే మరి!

అతి భారీ కాయుడైన తొమ్మిది సంవత్సరాల గజానన్ శివశంకర్ కచార్డె 87 కిలోల బరువు గల ఈ లంబోదరుడు మహారాష్ట్రకు చెందిన యవత్‌మల్ జిల్లాలోని సగన్‌కి గ్రామస్థుడు

ఇప్పుడీ కుర్రాడు బరువు తగ్గించుకోవడానికని బొంబాయి ఆసుపత్రిలో చేరాడు పాపం అతని కోరిక ఎప్పటికి తీరి అందరి పిల్లల మాదిరిగా సంతోషంతో తిరుగుతాడో!!

"నీకెవడిచ్చాడు ఆ స్వతంత్రం? నాతో మాటవరసకైనా చెప్పలేదే! నా వృకున్న దాన్ని పొగరు కాక పోతే ఏమిటా నిర్ణయాలూ, స్వతంత్రాలు?"

"అవునండీ! భర్త భార్యకు ఆర్థికంగా స్వతంత్రం ఇవ్వనప్పుడు అత్యవసర పరిస్థితిలో ఆమెకి ఆమే స్వయం నిర్ణయం తీసుకోడంలో తప్పులేదు నామీద చదువుకి ఖర్చు పెట్టాడు నాన్న అయినా ఆయనకి ఫలితం దక్కలేదు ఆ ఫలితం మీరే నెలనెలా అనుభవిస్తున్నారు ఆయనిచ్చిన ఐదెకరాల పొలానికి ఫలితం నెలనెలా అద్దె రూపంలో రెండు వేల ఐదువందలు వస్తోంది అంటే మొత్తం నెలకి సుమారు ఆరువేలు మీకు లభిస్తోంది అయినా ఆ విలువ మీకు తెలియలేదు అయినా ఒక్కసారి ఆపరేషనుకి ఆయనకి ఒక ఆరువేలు ఖర్చు చేయడం ఇష్టంలేకపోయింది" ఇక నా వాటాకి వచ్చే ఆ పల్లెటూరి ఇల్లు సగంమీద వచ్చేకొద్దిపాటి డబ్బూ మీకో లెక్కా?" అంది కౌసల్య

ఎంత సౌమ్యంగా మాట్లాడినా ఆమె మాటల్లోని వ్యంగ్యం అతడికి కొరడాతో కొట్టినట్లనిపించింది

"చూస్తానుగా! రేపటినించి మనింట్లోనే ఉంటారుగా! కళ్లాన్చిన తండ్రి ఏ మాత్రం బాగా మసలుకుంటాడో నేనూ చూస్తాను" అన్నాడు వెటకారంగా వెంకట్రావు

"మీకా బెంగ అక్కర్లేదులెండి! ఇక వాళ్లు మనింట్లో ఉండరు ఎదురింట వాళ్ల ఔట్ హౌస్ వాళ్ల కోసం అద్దెకి తీసుకున్నాను అందులో ఉంటారు ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు ఆపరేషనుకి పోగా మిగిలినది ఏటా వారికి వచ్చే పొలం శిస్తు ఆదాయం బ్యాంకులో వేశాను వారి పేరుతో ఆ డబ్బుతో పనిమనిషి సాయంతో వారక్కడ నిశ్చింతగా ఉంటారు" అంది స్థిరంగా కౌసల్య

తను చెప్తే గాని ఆమెకి ఏమీ తెలియదనీ, స్వంత తెలివి లేదని, అమాయకురాలని అనుకునే తన కౌసల్య ఎంత తెలివిగా నిర్ణయాలు తీసుకుంది? అని ఆశ్చర్యపోయి చూస్తూ ఉండిపోయాడు వెంకట్రావు ఆమె హృదయం ఎంతగా నలిగి, విసిగి ఆ నిర్ణయం తీసుకుందో అతగాడు ఎప్పటికీ గ్రహించలేదు